



దన్నూర్ గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీ జి.నగేష్

గ్రామాలలో పర్యటించిన ఎంపీ

బోథ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని పొచ్చెర, దన్నూర్ గ్రామాలలో గురువారం ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ పర్యటించారు. ఆయా గ్రామాలలో ఇటీవల మృతిచెందిన కుటుంబాల వారిని పరామర్శించారు. అనంతరం ఆయా గ్రామాల వారితో గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి మండలం పార్టీ కన్వీనర్ బోరే రవీందర్ ఎంపీ దృష్టికి సెల్ టవర్ నిర్మాణపు పనుల విషయమై తీసుకు వెళ్లడం జరిగింది. కొన్ని గ్రామాల్లో టవర్ల నిర్మాణం పూర్తయిన సిగ్నల్ లేక ఇబ్బందులు పడుతున్నారని, మరి కొన్ని గ్రామాల్లో సెల్ టవర్లను పూర్తి చేయాల్సి ఉందని వివరించారు. స్పందించిన ఎంపీ త్వరలోనే సెల్‌ఫోన్‌లో సిగ్నల్ వచ్చేలా టవర్ల నిర్మాణం పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడతామని ఎంపీ పేర్కొనడం జరిగిందన్నారు. ఆయన వెంట బిజెపి నాయకులు మల్లెపూల రమేష్ మిట్కారే రాజేశ్వర్, దన్నూర్ గ్రామ మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, సోనాల గ్రామానికి చెందిన గంగాధర్, పోచ్చెర గ్రామానికి చెందిన మహిపాల్, ధనుర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్

బాల్య వివాహ ముక్త్ భారత్‌పై విద్యార్థులకు అవగాహన

నేరడిగొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఫోక్సో చట్టం పై గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని వారి హక్కులకు ఎటువంటి భంగం కలిగిన ఈ 1098 నెంబర్‌కి కాల్ చేసి వాటి సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు భారతదేశాన్ని బాల్య వివాహ ముక్త్ భారత్‌గా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ చిన్న పిల్లల పెళ్లిళ్ల వల్ల జరిగే అనర్థాల గురించి, పిల్లలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీయూ ఎస్‌ఐసీ వినోద్, సోషల్ వర్కర్ రవికాంత్, అంగన్‌వాడీ టీచర్స్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ

బోథ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల అధ్యక్షులకు గురువారం పుస్తక నిర్వహణ ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ తరగతులను నిర్వహించారు. శిక్షణ తరగతులను బోథ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నాగ పణీంద్రతో పాటు ఐకేపీ ఏపీఎం మాధవ్ ప్రభుత్వ పథకాల పైన ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కలిగే విధంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తూ.చా. తప్పకుండా అమలు పరచాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సీఆర్‌బీ తోడిశెట్టి ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

'పట్టుదలతో చదివితే విజయం'

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివితే విజయం సొంతమవుతుందని హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షులు దుర్వ సంతోష్ అన్నారు. గురువారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల చదువుకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ట్రస్టు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయిస్తూ విజయం సాధించాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్ మానుకుమార్, గారుశే కిరణ్, ఆదిమూలం నరేష్, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల తీవ్రతపై సిబ్బంది సర్వే

తాంసి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో జ్వరాలు ప్రబలి మంచం పడుతున్న విషయమై వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో వ్యాధుల తీవ్రతపై గురువారం సర్వే చేపట్టారు. దీనిలో భాగంగా గ్రామాల్లోని వీధుల్లో తిరుగుతూ ఎక్కడెక్కడ వ్యాధులు సోకుతున్నాయో పరిశీలించారు. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉందో అక్కడ ప్రత్యేక చికిత్సలు చేయనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి తులసీరాం పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలు తాగునీటి విషయంలో ప్రత్యేకశ్రద్ధ చూపాలని కోరారు. ఎండల తీవ్రతతో పాటు రాత్రి చలి ఎక్కువగా ఉండడంతో వ్యాధులతో ప్రమాదం ఉందని తెలిపారు. ఎక్కడైనా వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లయితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు.



వీధుల్లో తిరుగుతూ వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

సమస్యల్లో.. సర్కారు బడి

- తరగతి గదులు లేక ఆరుబయటనే చదువులు
- తడకల పందిరి, రేకుల షెడ్లు, గుడిలోనే తరగతులు
- ఇంకా అసంపూర్తిగానే 'మన ఊరు-మన బడి' పనులు
- ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో మరీ అధ్వానం
- ప్రభుత్వ విద్యపై పట్టింపు కరువు
- జిల్లావ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలు 500 కాగా, ప్రాథమికోన్నత 119, ఉన్నత పాఠశాలలు 120



భీంపూర్ మండలం బెల్సారి రాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రమాదకరంగా కనిపిస్తున్న టేకిడిగూడ పాఠశాల

ఆదిలాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్కారు బడులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. చదువులపై ఆసక్తి ఉన్నా.. అవకాశాలు అందుబాటులో లేకపోవడంతో ఎందరో మంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. అక్షరాలను నేర్చుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మా ఊరిలో బడిని నిర్మించాలంటూ ఇటీవల మావల మండలం దుబ్బగూడ గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు మొర పెట్టుకోవడంతో ప్రభుత్వమే స్పందించింది. అయితే ఇలాంటి పరిస్థితులే జిల్లాలో చాలాచోట్ల కనిపిస్తున్నాయి. బడి ఉన్నా సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో తాత్కాలిక ఉపాధ్యాయులతోనే తరగతులను నెట్టుకొస్తున్నారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 500 ఉండగా, ప్రాథమికోన్నత పాఠశాలలు 119, ఉన్నత పాఠశాలలు 120 ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 59,685 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే దాదాపుగా కొన్నిచోట్ల సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతూ చదువుకోవాల్సి వస్తుంది. ఎండైనా.. వానైనా ఆరుబయటనే చదువులను కొనసాగిస్తున్నారు. అసలే జిల్లాలో అంతంత మాత్రంగా అక్షరాస్యత కనిపిస్తోంది. దీనికితోడు ప్రభుత్వ బడులపై అధికారులు నిర్లక్ష్యం చూపడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ప్రభుత్వాలు, పాలకులు మారినా.. సర్కారు బడుల పరిస్థితి మాత్రం మారడం లేదన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

ఏకాగ్రతను కోల్పోతున్న విద్యార్థులు

ప్రైవేటు పాఠశాలలతో పోల్చుకుంటే సర్కారు బడుల్లో వసతులు నామ మాత్రంగానే కనిపిస్తున్నాయి. అరకొర వసతుల నడుమ చదువులు ముందుకు సాగడం లేదంటున్నారు. శాశ్వత భవనాలు లేకపోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న తడకలు, రేకుల షెడ్లు, ఆలయాల్లోనే తరగతులను నిర్వహిస్తున్నారు. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులతో విద్యార్థులు ఏకాగ్రతను కోల్పోతూ చదువులపై సరైన దృష్టిని సారించలేకపోతున్నారు. ఆకస్మాత్తుగా ఈదురుగాలులు, వడగాళ్లు వస్తే భయపడి విద్యార్థులు ఇంటికి తిరుగుముఖం పడుతున్నారు. చేసేదేమీలేక ఉపాధ్యాయులు కూడా సెలవులు ప్రకటిస్తూ వెళ్లిపోతున్నారు. తరగతి గదులు లేకపోవడంతో గ్రామస్థులే స్వచ్ఛందంగా తాత్కాలిక షెడ్లను నిర్మించుకుంటున్నారు. ముఖ్యంగా ఏకోపాధ్యాయ, తాత్కాలిక ఉపాధ్యాయులు పని చేస్తున్న చోట తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఏదైనా అత్యవసర సమయంలో ఉపాధ్యాయుడు రాకపోతే పాఠశాల మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. కొన్నిచోట్ల తరగతి గదులు ఉన్నా.. పెచ్చులూడి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. చాలాచోట్ల కనీసం

(తరువాయి 6వ పేజీలో...)



పై ఫొటోలో కనిపిస్తున్న ఈ పాఠశాల.. ఇంద్రవెల్లి మండలం గట్టెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సీతాగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల. ఇక్కడ 3వ తరగతి వరకు పాఠశాలను నడుపుతున్నారు. ప్రస్తుతం 15 మంది విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారు. అయితే తరగతి గదులు లేకపోవడంతో గ్రామానికి చెందిన పెందూర్ మానిక్‌రావ్ అనే వ్యక్తి ఇంటి ముందు ఏర్పాటుచేసిన తడకల షెడ్డు కింద ఇలా తరగతులను నిర్వహిస్తున్నారు. చుట్టూ ఎలాంటి ప్రహరీ లేకపోవడంతో వడగాలులు, వర్షానికి ఇబ్బంది పడుతూ చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాటి పరిస్థితులే ఏజెన్సీ మారుమూల గ్రామాలలో చాలా చోట్ల కనిపిస్తున్నాయి.



పై ఫొటోలో కనిపిస్తున్న పాఠశాల.. సిరికొండ మండలం కుంటగూడ గ్రామపంచాయతీ పరిధిలోని పాలవాగు గ్రామంలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల. ఇక్కడ 5వ తరగతి వరకు పాఠశాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 2వ తరగతి వరకే తరగతులు కొనసాగుతున్నాయి. మొత్తం 20 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ గ్రామంలో తరగతి గదులు లేకపోవడంతో గ్రామ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులోనే తరగతులను నిర్వహిస్తున్నారు. అలాగే ఉపాధ్యాయుడిని కూడా కేటాయించకపోవడంతో తాత్కాలికంగా రూ.8 వేల వేతనం ఇస్తూ.. గ్రామానికి చెందిన ఓ యువకున్ని ఉపాధ్యాయుడిగా నియమించారు.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదు

: భీంరావ్, పాలవాగు గ్రామస్థుడు, సిరికొండ

మా గ్రామంలో బడిని నిర్మించాలని గతంలో పలుమార్లు ఐటీడీఏ అధికారులకు ఫిర్యాదు చేశాము. అయినప్పటికీ పట్టించుకోవడం లేదు. రెగ్యూలర్ ఉపాధ్యాయుడితో పాటు పాఠశాల భవనం నిర్మించాలని కూడా కోరుతున్నాం. మా పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అయినా సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల భవనంతో పాటు ఓ రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలి.

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడుతున్నాం

: ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్



ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే మన ఊరు-మన బడి పథకం కింద చాలా పాఠశాలల్లో వసతులను కల్పించడం జరిగింది. జిల్లాలో తరగతి గదులు లేని పాఠశాలలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. అలాగే రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమిస్తాం.

అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో టీఎన్జీఓ యూనియన్ నూతన జిల్లా డైరీని



డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తోపాటు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు సమిష్టిగా పని చేస్తూ జిల్లాను ప్రగతి పథంలో ముందు ఉంచాలని పేర్కొన్నారు. టీఎన్జీవోస్ డైరీ ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా ఉందని కొనియాడారు.ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు నంద అశోక్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా..కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లను సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, రాష్ట్ర నాయకులు తిర్మల్ రెడ్డి, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు మహేందర్, అరుణ్, వార్డెన్ సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింలు, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జాదవ్ నూర్ సింగ్, మున్సిపల్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు వెంకటేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఉద్యోగుల సంఘం జిల్లా గోవింద్, జిల్లా బాధ్యులు గోపి, సుజాత, రాధ, చంద్ర మోహన్, రాజేశ్వర్, చంద్ర శేఖర్, అనిల్, కలీం, సంతోష్, దిరేశ్, ఒం ప్రసాద్, సురేందర్ మహిళా ఉద్యోగులు ఆరతి, లక్ష్మి రజిత, ఆశ జ్యోతి, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, సభ్యులు

కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసిన సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఆధ్వర్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాను డిల్లీలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం సభ్యులు గురువారం కలిశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు పేస్కేల్ తదితర సమస్యలపై విన్నవించారు. రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు పంపిస్తే పరిష్కారానికి కృషి చేస్తామని కేంద్రమంత్రి అచ్చారు. ఇందులో సభ్యులు అనిల్ చారి, రవీందర్, శ్రీధర్, బిందుశ్రీ, ప్రియాంక, దీప్తి, తదితరులున్నారు.

కొత్త రేషన్ కార్డు కోసం మళ్లీ దరఖాస్తు చేయవద్దు : డీఎస్‌వో

ఉట్నూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా రేషన్ కార్డు కావాల్సిన వారు ప్రజాపాలనలో గాని గ్రామ సభలలో గాని దరఖాస్తు చేసుకున్నవారు తిరిగి మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకునే అవసరం లేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మహమ్మద్ వాజీద్ అలీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన రేషన్ కార్డుల జాబితా మండల తహసీల్దార్‌ల నుంచి సేకరించడం జరిగిందని, కొత్తగా వివాహం అయినా వారు కుటుంబం నుంచి వేరు పడడానికి తమ పేర్లను తల్లిదండ్రుల రేషన్ కార్డు నుంచి తొలగించాల్సిన అవసరం సైతం లేదని సూచించారు. ఒకవేళ ప్రజా పాలనలో గాని, గ్రామ సభలో గాని ఇంత వరకు కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయని వారు మాత్రమే మీ సేవలో దరఖాస్తు చేయాలని ఆయన పేర్కొన్నారు.

టీచర్స్ కాలనీలో అభివృద్ధి పనుల ప్రారంభం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో నెలకొన్న సమస్యలపై 'టీచర్స్ కాలనీలో సమస్యలెన్నో..' శీర్షికన ఇటీవలే 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో కాలనీ అభివృద్ధికి మంజూరైన రూ.12 కోట్ల నిధులతో పనులను ప్రారంభించారు. కాలనీలో ప్రధాన రహదారి నిర్మాణం చేపడుతున్నారు. అదేవిధంగా కాలనీలో పలుచోట్ల డ్రైనేజీలను నిర్మించారు. ఇంకొన్ని రోజుల్లో కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు తీరనున్నట్లు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాయినగర్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

- కాలనీ అభివృద్ధికి కృషి : కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె

బోథ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సాయినగర్ కాలనీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ పేర్కొన్నారు. గురువారం సాయి నగర్ కాలనీలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాప కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. కాలనీవాసులు ఐక్యతతో ఆలయాన్ని అభివృద్ధి చేయడం ఆదర్శంగా ఉందన్నారు. అయితే సాయి నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అయితే ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన గజేందర్‌ను సామాజిక సేవకుడు సహకార సంఘం డైరెక్టర్ చెట్ల ఉమేష్‌ను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి చెట్ల ఉమేష్ సహకార అందించడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తపరిచారు.

- రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

నేరడిగొండ: తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా



మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

ఆయన మాట్లాడుతూ తెలంగాణకు కాంగ్రెస్ మాత్రమే శ్రీరామరక్ష అని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. తనపై నమ్మకంతో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని ఆడే గజేందర్ అన్నారు. త్వరలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కానున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఆయన వెంట గాదె శంకర్, ఊశన్న, పాల శంకర్, రవి, తదితరులు ఉన్నారు.

ఆడ పిల్లలు ఆపదలో ఉంటే..
100, 181, 1098 నెంబర్లను సంప్రదించాలి

- బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సులో వినోద్

ఇచ్చోడ, ఫిబ్రవరి, 20(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నివారణకై ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని షుర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్ అన్నారు. గురువారం ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన బాలికల రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాలలో ఎన్జీవో ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ.. విద్యార్థులతో బాల్య వివాహ నిర్మూలనకై ప్రతిజ్ఞ చేశారు. ఆడ పిల్లల రక్షణ, సంరక్షణ కోసం ఒక వ్యవస్థనే పనిచేస్తుందన్నారు. ఆపదలో ఉన్న వారు ఎవరికీ బయపడకుండా డయల్ 100, 181, 1098 నెంబర్లకు కాల్ చేయాలన్నారు. బాలిక హక్కుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నారాయణ, ప్రిన్సిపాల్ రోజారాణి, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్‌ఫోర్స్ నరేందర్ రెడ్డి విజయాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని పని చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రజా సేవా భవన్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల కోసం ఎలా ముందుకు సాగాలో పెద్ద ఎత్తున హాజరైన శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ముగిసిన సీజన్-2 క్రికెట్ పోటీలు

తలమడుగు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన వేంకటేశ్వర ట్రోఫీ సీజన్-2 క్రికెట్ పోటీలు గురువారం ముగిశయి. ఈ పోటీల్లో తెలంగాణ, మహారాష్ట్ర నుంచి దాదాపు 60 జట్లు పాల్గొన్నాయి. కాగా, హోరాహోరీగా సాగిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాజట్లకు దాతలు నగదు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి కొత్తూరు గ్రామానికి పిడుగు సంజీవరెడ్డి రూ.40 వేలు, రెండో బహుమతి కోసాయి టీంకు కాటిపెల్లి హరీష్‌రెడ్డి రూ.30 వేలు, మూడో బహుమతి వన్ స్టాప్ సొల్యూషన్‌కు రూ.20,000వేలను తిరుపతి యాదవ్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. ఇందులో పిడుగు అభిరామిరెడ్డి, రవికాంత్‌యాదవ్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వార్షికోత్సవ వేడుకలు

బోథ్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో గురువారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సందర్భంగా బోథ్ సీఐ వెంకటేశ్వర రావు, ఎస్‌ఐ ప్రవీణ్, ఎంపీడీవో రమేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవిలు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల లో విద్య అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్‌తో పాటు పోషకుల అధ్యక్షులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థులను గెలిపించండి'

తాంసి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి టీచర్ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీ నాయకుల కోరారు. గురువారం మండల కేంద్రంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని పట్టభద్రులను ఉపాధ్యాయులను ప్రశ్నించే గొంతుగా భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు ఇందులో జిల్లా ఉపాధ్యక్షులు సామ సంతోష్ రెడ్డి, మండల నాయకులు పాల్గొనరు.

నేరడిగొండ: మండల కేంద్రంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఆకుల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. బీజేపీ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్కా కొమురయ్య చిన్నమలై అంజిరెడ్డి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు నారాయణ, నాయకులు రాములు, భీంరెడ్డి, మహేందర్‌రెడ్డి, పర్శురామ్ తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఉట్నూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓల్వాడీ గ్రామంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్మించి తలపెట్టిన నూతన హనుమాన్ మందిర్ నిర్మాణానికి మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్ రావు గురువారం భూమి పూజ చేశారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు అక్కడికి చేరకున్న మాజీ ఎంపీపీ , సమాకకు చెందిన కోరింగ యశ్వంత్ మహరాజ్, కప్పర్‌దేవికి చెందిన కోరింగ శంకర్ మహరాజ్, ఏందాకు చెందిన వామన్ మహరాజ్, ఓల్వాడీకి చెందిన విష్ణు మహరాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ కటోడ మెస్రం కోసేరావు పటేల్, గ్రామ పటేల్ దుర్వాదేవరావు, గ్రామ దేవరి దుర్వ కేశవ్ రావు, మాజీ సర్పంచ్ కోతుమాబాయి, మాజీ ఉపసర్పంచ్ బలవంతరావు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ లేని గ్రామాల్లో క్యాంపులు పెట్టాలి

● గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశం



డీలర్లతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎల్‌పీజీ ఏజెన్సీ డీలర్లతో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా గురువారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ లబ్ధిదారుడి ఈకేవైసీ విషయమై నెట్‌వర్క్ లేని గ్రామాల్లో క్యాంపులు పెట్టి ఈకేవైసీ చేయాలన్నారు. జిల్లాలోని ఎల్‌పీజీ డీలర్లకు, లబ్ధిదారులకు ఈ విషయమై తెలియపర్చాల్సిన వివరాలను తెలిపారు. సీఎం పైలెట్ ప్రాజెక్ట్ పబ్లిక్ హియరింగ్ జరుగు సమయంలో ఏజెన్సీకి సంబంధించిన వారు అందరూ తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు తప్పకుండా నియమాలు, సూచనలు పాటించాలని ఆదేశించారు.

● పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్

కలెక్టర్ రాజర్షిషా గురువారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో తాగునీరు, రైతుభరోసా, రేషన్ కార్డులు, పైలెట్ ప్రజావాణి, ఎల్‌ఆర్‌ఎస్, పవర్ స్విచ్ వేషన్, ఇందిరమ్మ ఇళ్లు, ఈఈ వీసీ సర్వే ఆఫ్ లెఫ్ట్ ఓవర్ హౌస్ హోల్డర్ అనే 8 అంశాలపై సమీక్షించారు. ప్రజా పాలనలో గానీ, గ్రామ సభలల్లో గాని రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే వారు మళ్లీ మీసేవలో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఒక వేల ప్రజాపాలనలో గానీ, గ్రామ సభలలో గాని రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయని యెడల కొత్త రేషన్ కార్డ్, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చుట కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్‌డీవో వినోద్ కుమార్, జడ్పీ సీఈవో జితేందర్, బసవేశ్వర్ రావు, సంబంధిత జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవో, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు

తలమడుగు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): దేవాపూర్‌లో సవారి బంగ్లా స్థలాన్ని ఒక వర్గం వారు ఆక్రమిస్తున్నారని గురువారం దేవాపూర్ గ్రామానికి చెందిన మరో వర్గం వారు డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ దేవాపూర్‌లోని సవారి బంగ్లా స్థలం గత దశాబ్దాల నుంచి పీర్ల పండుగ కోసం ఉపయోగిస్తున్నారన్నారు. కానీ దేవాపూర్ గ్రామానికి చెందిన మరో వర్గం వారు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వారిపై చర్యలు తీసుకుని స్థలాన్ని ఇప్పటిలాగే సవారి బంగ్లా కోసం ఉపయోగించే విధంగా చూడాలని గ్రామస్థులు అధికారులకు విన్నవించారు.

నిందితుడి అరెస్టు.. కోర్టుకు తరలింపు

తలమడుగు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఈనెల 18న కుటుంబ కలహాలతో గ్రామానికి చెందిన కోకూరు మహేందర్‌పై ఆయన బామ్మర్ది కుర్మా అశోక్ కత్తిపోట్లతో హత్య చేసి పరారయ్యాడు. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. గురువారం ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిందర్, ఎస్‌ఐ అంజమ్మలు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, పీఆర్సీ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు దర్శనాల నగేష్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, మున్సిపల్ యూనియన్ నాయకులు ఆత్మరాం, అజీం,భాస్కర్, జనార్ధన్, రాకేష్ రెడ్డి, స్వామి, గగన్, వెంకటి, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎల్ఐసీలో నియామకాలు చేపట్టాలి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత జీవిత బీమా ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు గురువారం ఆదిలాబాద్ ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సమ్మెలో స్థానిక సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఎల్ఐసీలో బేస్ క్యాడర్లు అయిన మూడు, నాలుగు తరగతుల ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని అన్నారు. అలాగే, సంస్థలో నూతన నియమకాలు చేపట్టాలని ఐసీఈయూ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు.

ఎనిమిది మందికి జరిమానా

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి ఉట్నూర్ కోర్టు న్యాయాధికారి జరిమానా విధించారని ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. కాగా, మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా.. వారిని ఉట్నూర్ కోర్టులో హాజరుపరిచారు. ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించారు. మద్యం తాగి వాహ నాలు నడిపి ప్రమాదాలకు కారణం కావొద్దని ఎస్సై సూచించారు. ఇందులో పోలీసులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని గోకొండ గ్రామంలో గురువారం పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల మేరకు.. గోకొండ గ్రామంలో సాయంత్రం సమయంలో పేకాడుతున్న ఐదుగురిని పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి 1800 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో టూటౌన్ పోలీసులు ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరా నగర్‌లోని బెల్టు షాపులపై గురువారం దాడులు నిర్వహించారు. ఇందిరా నగర్‌లోని బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తున్న షేక్ అబ్దుల్ ఫరీద్ నుంచి రెండున్నర లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.2800 ఉంటుందని టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపారు. అదే విధంగా అదే కాలనీలోని మరట్వార్ మధుకర్ నుంచి 28 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.2770 ఉంటుందని పేర్కొన్నారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల అందజేత

సిరికొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలానికి చెందిన పలువురి సెల్‌ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించడంతో బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ యాప్ ద్వారా సెల్‌ఫోన్లు దొంగిలించిన వ్యక్తులను గుర్తించి, వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని గురువారం బాధితులకు సీఐ భీమేష్, ఎస్సై శివరాంలు సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సమస్యల్లో సర్కారు బడి

(5వ పేజీ తరువాయి...)

మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేకపోవడం తో ఒకటికి రెంటికి విద్యార్థులు బయటికే వెళ్లాల్సి వస్తోందంటున్నారు.

వెంటాడుతున్న నిధుల కొరత

ప్రభుత్వ పాఠశాలలను గాడిలో పెట్టేందుకు గత ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు జరిగాయి. ఇందులో భాగంగానే 'మన ఊరు-మన బడి' పథకాన్ని అమలు చేశారు. జిల్లావ్యాప్తంగా 237 పాఠశాలలను ఎంపిక చేసి అదనపు గదులు ప్రహరీగోడ, మరుగుదొడ్ల నిర్మాణ పనులను చేపట్టారు. అయితే ఇప్పటివరకు 70శాతం పనులే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 30శాతం పనులు వివిధ దశలో కనిపిస్తున్నాయి. 'మన ఊరు-మన బడి' పథకం కింద చేపట్టిన పనులు ఇంకా అసంపూర్తిగానే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే ఉన్న తరగతి గదులను కూల్చివేసి వాటి స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టిన పూర్తిగాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మిగిలిపోయిన పనులను ఎప్పుడు పూర్తిచేస్తారో? అని అర్థం కానీ పరిస్థితి ఉందని విద్యార్థులు వాపోతున్నారు. అయితే ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతోనే పనులను నిలిపివేయాల్సి వచ్చిందని సంబంధిత కాంట్రాక్టర్లు చెబుతున్నారు. వేసవిలో ఎలాగో వెల్లదీస్తున్నా.. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు అసంపూర్తిగా మిగిలిపోయిన పనులపై ప్రత్యేకదృష్టిని సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చదువుకు దూరమవుతున్న గిరిజన విద్యార్థులు

ఏజెన్సీలోని మారుమూల గిరిజన గ్రామాలలో పరిస్థితులు మరీ అధ్వానంగా కనిపిస్తున్నాయి. స్థానికంగా విద్యావకాశాలు అందుబాటులో లేకపోవడంతో వేల మంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. అసలే నిరక్షరాస్యులైన అమాయక ఆదివాసీలు చదువుపై అంతగా ఆసక్తి చూపడం లేదు. దీనికితోడు ఇబ్బందులు ఎదురుకావడంతో చదువుపై దృష్టి సారించడం లేదు. జిల్లాలోని చాలా గ్రామాలలో బడుల పరిస్థితి అధ్వాన్నంగా కనిపిస్తుంది. చాలాచోట్ల నిర్వహణ లేకపోవడంతో తరగతి గదులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. లేనిచోట తాత్కాలిక షెడ్లలోనే చదువులను కొనసాగిస్తున్నారు. ఊరుని విడిచి చదువుకునే స్తోమతలేక ఆదివాసీ బిడ్డలు తమ వ్యవసాయ పనుల్లోనే నిమగ్నమవుతున్నారు. చదువుకునేందుకు అవకాశాలు కల్పించాలని కోరుతూ.. ఎన్నో ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే వారే కరవవుతున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జైనథ్ మండలంలోని కోరట శివారు పెన్‌గంగా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఆదిలాబాద్ రూరల్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్ సిబ్బందితో కలిసి చాందా బైపాస్ వద్ద తనిఖీలు చేస్తుండగా.. నాలుగు ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. మరోవైపు ల్యాండసాంగ్వి సమీపంలో మరో ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. జరిమానా కోసం మైనింగ్ ఏడీకి నివేదించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంతర్గాంలో యువతి అదృశ్యం

భీంపూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతర్గాంకు చెందిన ఒక యువతి అదృశ్యం కాగా, పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. గోముత్రికి చెందిన 19ఏళ్ల ఓ యువతి ఈనెల 19 నుంచి కనబడటం లేదు. ఈ మేరకు తండ్రి కాశీనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోమూత్రి గ్రామానికి చెందిన మెస్రం ఆశిష్ అనే యువకుడిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్సై మహ్మద్‌ఖలీం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిలాబాద్ రూరల్: ఇంద్రవెల్లి మండలంలోని గౌరాపూర్‌కు చెందిన సక్రి అశ్విని అదృశ్యమైనట్లు టూ టౌన్ సీఐ విష్ణు ప్రకాష్ తెలిపారు. బుధవారం ఇంద్రవెల్లి నుంచి పూణెకు వెళ్లేందుకు ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చింది. వారందరూ రైలు ఎక్కగా, ఆమెతో పాటు కుమార్తె కనిపించకుండా పోయారు. దీంతో భర్త గోరక్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి అల్లోల



పరామర్శించిన మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆదర్శ నగర్‌లో నివాసం ఉండే రిటైర్డ్ వీఆర్‌వో పడకంటి సూర్య కాంతారావు ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఆయన కుటుంబాన్ని గురువారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. కాంతారావు సోదరుడు నర్సింగ్ రావుతో మాట్లాడి ఆయన మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాంతారావు కుటుంబం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీతో మంచి అనుబంధాన్ని కలిగి ఉందని, ఆయన హఠాన్మరణం చెందడం బాధాకరమని ఈ సందర్భంగా ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మంత్రి వెంట ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, అందకూర్ మాజీ సర్పంచ్ సాగర్ రావు, పాకాల ఫౌండేషన్ చైర్మన్ రామచందర్, బన్సపెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బీవీ రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్ గజేందర్, కుంటాల మండల బీజేపీ నాయకులు రవీందర్ రావు, తదితరులు ఉన్నారు.

కనకాపూర్‌లో ప్రమాదానికి గురైన కస్తూరిరాజు మృతి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గత బుధవారం కనకాపూర్ గ్రామశివారులోని ధర్మకాంట వద్ద కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామస్థుడు కస్తూరి రాజు గురువారం మృతిచెందినట్లు ఎస్సై సుమలత తెలిపారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మల్‌కు అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రి నిజామాబాద్‌కు తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో కస్తూరిరాజు అలియాస్ రాజేశ్వర్ మరణించాడు. నర్సాపూర్ గ్రామానికి చెందిన కే.సుధాకర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ పాల్దే వినోద్ కుమార్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె వివరించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నివాసముంటున్న సీసా కమ్మరి పవర్ రమేష్(29) అనే యువకుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ గత కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసై ఏమీ పని చేయకుండా తిరుగుతున్నాడు. గత 15వ తేదీన బాగా మద్యం తాగి ఇంటికి రాగా అతని భార్య ఎందుకు ప్రతిరోజు మద్యం తాగుతున్నావని మందలించింది. క్షణికావేశంలో తన జీవితంపై విరక్తి చెంది గుర్తుతెలియని పురుగుల మందు ఇంటికి తీసుకువచ్చి తాగగా వెంటనే చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బుధవారం రాత్రి సమయంలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి భార్య పవర్ జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

రోడ్డుప్రమాదంలో నలుగురికి గాయాలు

కడెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్నాపూర్ చెరువు దగ్గర గురువారం ఉదయం రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. దస్తురాబాద్ నుంచి కడెం వెళ్తున్న ఆటో చెరువు వద్ద అదుపు తప్పి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఆటోలో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలు కాగా, గొడిసిర్యాల గ్రామానికి చెందిన ఎల్లయ్య తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే 108లో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ పారిపోయినట్లు స్థానికులు తెలిపారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి



మాట్లాడుతున్న ముథోల్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్

తానూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రానున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ముథోల్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వాగ్దేవి, వివేకానంద, వాసవీ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు లస్మారెడ్డి, సీనీయర్ నాయకుడు మోహన్‌రెడ్డి, మారుతి, ఎళ్లప్ప, శీకరప్ప, రాజశేఖర్, రవిలున్నారు.

భైంసా రూరల్ : ప్రభుత్వంపై పోరాడే వ్యక్తులకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సీరం సుష్మారెడ్డి అన్నారు. మండలంలోని మహాగాం, చింతల్‌బోరి, గుండేగాం, కోతుల్‌గాం గ్రామాల్లో ప్రచార పర్వాన్ని చేపట్టిన సందర్భంగా ఆమె మాట్లాడారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి కొమురయ్యకు పట్టం కట్టాలన్నారు. ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ఆదేశానుసారం అన్ని గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలంతా కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహాగాం తాజా మాజీ సర్పంచ్ అప్పాలరాకేష్, కురుమ కృష్ణ, సోనారి యోగేష్, శంకర్, భోజన్న, సాయినాథ్, తిరుపతి, దత్తాత్రి, అఖిల్ పటేల్, లక్ష్మీ, గజ్జారాం, బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కుంటాల, ఫిబ్రవరి, 20 : (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి సమీపిస్తున్న తరుణంలో మండంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివమాలలు ధరించిన స్వాములు ఉదయం నుంచి శివాలయంలో అభిషేకం, అర్చన, హారతి, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వాముల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సూర్యాపూర్ గ్రామం నుంచే కాకుండా పక్క గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు



వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు దిలావర్‌పూర్ మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు ప్రియాంక తెలిపారు. నేటి నుంచి మార్చి 30 వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ఆసుపత్రిలో అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలను ప్రారంభించినట్లు చెప్పారు. అసంక్రమిత వ్యాధులైన బీపీ, డయాబెటిస్, క్యాన్సర్ తదితర వ్యాధులను గుర్తించి జిల్లా కేంద్రానికి నివేదికలను పంపడం జరుగుతుందన్నారు. ఇందులో సీహెచ్‌వో రాజేశ్వర్, దుర్గా భవాని, ఏఎన్ఎంలు పుష్పలత, సౌందర్య, ఆశాలు పాల్గొన్నారు.

'ఏఐసీసీటీయూ మహాసభను విజయవంతం చేయాలి'

పెంబి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 24న జరిగే ఏఐసీసీటీయూ 11వ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నిర్మల్ జిల్లా కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్ అన్నారు. ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... న్యూ ఢిల్లీలోని ప్యారల్ భవన్‌లో ఈ నెల 24, 25న జరిగే జాతీయ మహాసభను విజయవంతం చేయాలన్నారు. రైతులు, కార్మికులు, కూలీలు ఈ సభను విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు.

తరోడా తండాలో కబడ్డీ టోర్నీ



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ముథోల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తరోడా తండాలో గ్రామస్థుల ఆధ్వర్యంలో గురువారం కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఆయా గ్రామాల నుంచి 22 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ విజేతగా తరోడా తండా జట్టు గెలుపొందగా ద్వితీయ విజేతగా నాందేడ్ జట్టు గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ విజేత జట్టుకు నగదు బహుమతి రూ.11,111లు, ద్వితీయ విజేతకు నగదు బహుమతి రూ. 5,051లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ పెద్దలు శంకర్ పవార్, మాజీ సర్పంచ్ అరిపోద్దిన్, జాదవ్ చందర్, జాదవ్ భీమ్ రావు, ఆడే రమేష్, రాథోడ్ సంతోష్, రాథోడ్ గణపతి, రామారావు, పరశురాం జాదవ్, నరహరి బాబు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది, ఉపాధ్యాయులు

కుభీర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌లోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో గురువారం మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కల్పించారు. బేటీ బచావో బేటీ పడావో పథకం పదిసంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 45 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కార్యక్రమం గురించి తెలిపారు. అదే విధంగా లింగ సమానత్వం, ఆడపిల్లల చదువు ప్రాముఖ్యత, బాలికల సాధికారత, చైల్డ్ లైన్ సర్వీసెస్, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, బాల్య వివాహాలు, బాల్య వివాహ నిర్మూలన చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిన్నన్న, సీడీపీవో రాజశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్టు మౌనిక, చైల్డ్ లైన్ సిబ్బంది శ్రీదేవి, పద్మావతి ఉన్నారు.

నేటి నుంచి అక్కాపూర్ ఎల్లమ్మ జాతర



రేణుకామాత

నిర్మల్‌రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలోని అక్కాపూర్ శ్రీ రేణుకామాత ఎల్లమ్మ ప్రథమ వార్షికోత్సవం (పుట్టఎల్లమ్మ) సందర్భంగా పూజలు నిర్వహించేందుకు నిర్మల్ గౌడకులస్తులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నుంచి ఐదు రోజులపాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. తొలిరోజు నిర్మల్ గౌడ కులస్తులు ప్రతి ఇంటా పందిరి వేసుకునే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. శనివారం ఉదయం ఏడుగంటల నుంచి ఉత్సవ విగ్రహం తీసుకువెళ్లి, ఆరు గ్రామాల్లో జోగుపట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆదివారం పోచ మ్మ బోనాలు ఉంటాయి. సోమవారం గంగ బోనం, కాటమయ్య బోనం కార్యక్రమాలు అక్కాపూర్ ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో చేపట్టనున్నారు. చివరి రోజు మంగళవారం శ్రీ రేణుకమాత కల్యాణం, ఎల్లమ్మ బోనాలు, పుట్ట ఎల్లమ్మ బోనాల అనంతరం గావుపట్టుట కార్యక్రమంతో బోనాల జాతర ముగియనుంది. ఈ మేరకు నిర్మల్ గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమాలకు గౌడ కుల స్తులు పెద్దమొత్తంలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

57వ రోజు గిరిజన రైతు రిలే నిరాహార దీక్ష



రైతుకు మద్దతుగా కూర్చున్న వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : 57 రోజులుగా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలేనిరాహార దీక్ష చేస్తున్న గిరిజన రైతుకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు గురువారం మద్దతు తెలిపారన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జాదవ్ మోతిరామ్ వాళ్ళ తాతల సమయం నుంచి సాగులో ఉన్న పదిఎకరాల భూమి నుంచి ఎకరంనర భూమిని క్రీడాప్రాంగణంగా మార్చారని, ఆ రైతుకు సమస్య పరిష్కరించి న్యాయం చేసేంత వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బి.పద్మ, జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుర్గం కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరిక



కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న రమేష్

భైంసా, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని కుభీర్ మండల కాంగ్రెస్ యువజన నాయకుడు గాడేకర్ రమేష్ ఆ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యురాలు పి. రమాదేవీ ఆధ్వర్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గాడేకర్ రమేష్ గులాబీ కండువా కప్పుకున్నారు. పార్టీ అధినేత కేటీఆర్ గాడేకర్ రమేష్‌కు గులాబీ కండువా వేసి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఇందులో పార్టీ ప్రతినిధులు సతీష్ అరేపల్లి, అక్షయ్ పటేల్, బాబు, గంగాధర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మీ పాల్గొన్నారు.

తాత్కాలిక షెడ్‌లోనే తరగతులు

● నానా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ● శాశ్వత భవనాన్ని నిర్మించాలంటున్న తల్లిదండ్రులు

మావల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తాత్కాలిక షెడ్‌లలో సాగుతున్న పాఠశాలల్లో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో గల పాఠశాలల్లో పరిస్థితి విద్యార్థుల పాలిట శాపంగా మారింది. వివరాల్లోకి వెళితే.. మావల మండలంలోని బట్టి సావర్గం గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడ దాజినగర్‌లో ప్రభుత్వ పాఠశాల ఇది వరకు అద్దె భవనంలో మొదట 38 మంది విద్యార్థులతో కొనసాగేది. అంత సాఫీగా సాగుతున్న పాఠశాల భవనాన్ని ఇంటి యజమాని అమ్మేయడంతో పరిస్థితి తారుమారయింది. ఆ ఇంటిని కొనుగోలు చేసిన వారు ఇంట్లో ఉండటానికి రావడంతో అద్దె భవనాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఖాళీ చేసిన తర్వాత వేరే భవనాన్ని అద్దెకు తీసుకుందామంటే ఎవరు అద్దెకు ఇవ్వడానికి ముందుకు రాలేదు. ఈ తరుణంలో ఆ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు చందాలు వేసుకొని తడకలు, రేకులు కొనుగోలు చేసి తాత్కాలిక షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం 28 మంది విద్యార్థులతో ఇద్దరు ఉపాధ్యాయులతో పాఠశాల నడుస్తుంది. అందులో మహిళా టీచర్ ఒకరు లాంగ్ లీవ్‌లో ఉన్నారు. కాగా వాళ్ళు ఏర్పాటు చేసిన షెడ్‌లో పూర్తిగా విద్యార్థులు పడకపోవడంతో పక్కనే ఉన్న గుడిలో తరగతులు కొనసాగాయి. వర్షం పడితే సెలవు పెట్టాల్సి వచ్చేది. మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థులు ఇళ్లలోకి వెళ్లిపోయే వారు. ఎండలు తీవ్రమవుతున్న వేళ రేకుల షెడ్ ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పరిస్థితి చూసి ఆందోళన చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం నిర్వహించిన ప్రజావానికి హాజరైయ్యి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే సీఎం దృష్టికి సైతం వెళ్లడంతో భవన నిర్మాణానికి అడుగులు అపుడుతున్నాయి. గురువారం జిల్లా అధికార బృందం పాఠశాలను సందర్శించి పరిస్థితిపై ఆరా తీశారు. ఇన్నాళ్లు షెడ్‌లో సాగుతున్న పాఠశాలను పక్కనే ఉన్న ఓ ఇంటిని రూ. 3,500కు అద్దెకు తీసుకొని అందులోకి మార్చారు. దీంతో తీవ్ర ఎండల నుంచి ఉపశమనం లభించిందని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కొత్త భవనం నిర్మాణం అయ్యే వరకు ఆ అద్దె భవనంలో పాఠశాల కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.


తాత్కాలిక షెడ్‌లో పాఠశాల


అద్దె భవనంలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

శాశ్వత భవనాన్ని నిర్మించాలి

● మంజుల, కాలనీ వాసి



మా పాఠశాల భవనం లేక చాలా పిల్లలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో తడిసిపోయేవారు. ఇప్పుడు తీవ్ర ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొత్త భవనాన్ని నిర్మించాలని కోరుతున్నాం.

కనీస సౌకర్యాలు కల్పించాలి

● లక్ష్మీ కాలనీ వాసి



మా కాలనీలో పేదవాళ్ళం నివసిస్తున్నాం. ప్రైవేట్ బడులకు పంపించే స్తోమత మాకు లేదు. మాకు ప్రభుత్వ బడుల్లో చదివిస్తాం. మా కాలనీలో నూతన భవనంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలి. తాత్కాలిక షెడ్‌లో సౌకర్యాలు లేక పిల్లలు ఇంటికి వచ్చేస్తున్నారు.


సమావేశంలో పాల్గొన్న బీజేపీ ప్రముఖులు

ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులను గెలిపించండి

● నిర్మల్‌లో సన్నాహక సమావేశంలో పార్టీ ముఖ్య నేతల పిలుపు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేయాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, సంఘటన మంత్రి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం నిర్మల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అంజికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా జిల్లాల ప్రభారీలు, కన్వీనర్లకు ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా.. ఇప్పటివరకు హామీలను నెరవేర్చడం లేదన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో బీజేపీదే అధికారమని స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి మల్కా కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభాకర్, రామ్‌చంద్రారెడ్డి కన్వీనర్లు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభిస్తున్న సునీల్ బన్సల్

ఆదర్శం.. కుభీర్ సహకార సంఘం

● ఈ ఏడు రూ. 35.4లక్షల ఆదాయం

కుభీర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దం క్రితం నష్టాల ఊబిలో కూరుకుపోయిన కుభీర్ సహకార సంఘం నేడు లాభాల బాటలో పయనిస్తోంది. యేటా మండల రైతులకు సకాలంలో రుణాలు, విత్తనాలు, ఎరువులు అందజేస్తూ ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతు పండించిన పంట దిగుబడులను కొనుగోలు చేస్తూ ఆదర్శ సహకార సంఘంగా గుర్తింపు పొందుతోంది. ప్రస్తుతం ఈ యేడు రూ. 35.4లక్షల ఆదాయంతో ఉత్తమ సహకార సంఘంగా నిలుస్తోంది. మండలంలో మొత్తం 41 గ్రామ పంచాయతీలతో పాటు అనుబంధ గ్రామాల్లో 4235 మంది, ఈ సంవత్సరం నూతనంగా సభ్యత్వం పొందిన 227 మంది రైతులను కలుపుకొని మొత్తం 4462 మంది రైతులు సభ్యులుగా కొనసాగుతున్నారు.

● రూ. 20లక్షలతో పెట్రోల్ పంపు నిర్మాణం

నేటి ఆధునిక యుగంలో మారుతున్న వ్యవసాయ పద్దతులకు అనుగుణంగా రైతులు ట్రాక్టర్లు, తైవాన్ పిచుకారి పంపులు, నూర్పిడి యంత్రం ఉపయోగం చేస్తూ ఇందన ఇబ్బందులు ఎదుర్కొంటున్న కారణంగా మండలానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్సి గ్రామ శివారులో రూ. 20లక్షల వ్యంతో పెట్రోల్ పంపు నిర్మించి రైతులకు సౌకర్యం కల్పించింది. ఈ పెట్రోల్ పంపు నడపడం వల్ల ఈ సంవత్సరం రూ. 3.8లక్షల ఆదాయం సమకూరింది.

● అర్హులైన రైతులందరికీ రుణాలు

సహకార సంఘం పరిధిలోని 46 మంది రైతులకు దీర్ఘకాలిక రుణాల క్రింద రూ. 3.25 కోట్లు, 76 మంది రైతులకు గాను స్వల్ప కాలిక రుణాలు రూ. 80.91లక్షలను అందించి ఇప్పటికే సుమారు 80శాతానికి పైగా రుణాలు రికవరితో కుభీర్ సహకార సంఘం ప్రత్యేక గుర్తింపు సాదిస్తోంది.

● ఎరువుల విక్రయ దిగుబడుల సేకరణతో..

ఈ ఏడాది ఖరీఫ్, రబి సీజన్‌లో మండల రైతులకు 2639 డీఏపీ, 44940 యూరియా బస్తాలను సకాలంలో అందించి రూ. 4.59 లక్షల 879 రూపాయలు సంఘానికి లాభం సమకూరింది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన 36వేల 4 క్వింటాళ్ల సోయాబీన్ కొనుగోలు చేసి రూ. 17.61 కోట్లు, గత ఏప్రిల్‌లో 1218 మంది రైతులకు సంబంధించిన 28వేల 111 క్వింటాల్లు కొనుగోలు చేసి కేవలం 48గంటల వ్యవధిలో రైతుల ఖాతాల్లో 9కోట్ల 4లక్షలు జమ చేస్తోంది.



కుభీర్ సహకార సంఘం ఇదే

అర్హత ఉన్న ప్రతీ రైతుకు రుణాలు

● రేకుల గంగాచరణ్, మార్క్‌ఫెడ్ స్టేట్ డైరెక్టర్, సహకార సంఘం అధ్యక్షుడు



సహకార సంఘం పరిధిలోని అర్హులైన రైతులందరికి దీర్ఘ కాలిక, స్వల్పకాలిక రుణాలు అందిస్తున్నాం. ఒకప్పుడు నష్టాల్లో కూరుకు పోయిన సంఘాన్ని ప్రణాళిక బద్ధంగా లాభాల దిశగా ముందుకు నడిపిస్తున్నాము. మా సంఘంలో రుణాలు పొందిన రైతులు సకాలంలో వాయిదాలు చెల్లిస్తున్నారు. విత్తనాలు, రసాయన ఎరువులు కొనుగోలు చేసి వారు పండించిన వ్యవసాయ దిగుబడులను సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేందరంలో విక్రయిస్తూ సహకరించడంతో సంఘం లాభాల్లో కొనసాగుతుంది.

ముథోల్‌లో అఖండ హరినామ సప్తాహ ప్రారంభం


సప్తాహలో పాల్గొన్న భజన భక్తులు

ముథోల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయంలో గురువారం ఉదయం అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది. బాలాజీ గురూజీ, రాందాస్ గురూజీ నేతృత్వంలో ఈ సప్తాహం అంగరంగ వైభవంగా గ్రామస్థులు నిర్వహిస్తున్నారు. ఉదయం వేళలో వేకువ జామున కాకడ హారతి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఈ సప్తాహం ఏడు రోజుల పాటు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

హిమాలయాలను అధిరోహించిన యువకుడు



నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన లక్కాకుల ఆదిత్య (23) హిమాలయ పర్వతాన్ని అధిరోహించాడు. ఈ నెల 8 నుంచి 12 వరకు 12,500ల ఫీట్ల ఎత్తును అధిరోహించాడు. ఆదిత్య స్థానిక న్యాయవాది లక్కాకుల తుకారాం కుమారుడు. స్థానికులు ఆదిత్యను అభినందించారు.

పదేళ్ల బీఆర్ఎస్,14 నెలల కాంగ్రెస్ పాలన విఫలం

● ఖానాపూర్ సమావేశంలో ఎంపీ నగేష్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

ఖానాపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాలనలో బీఆర్ఎస్, 14 నెలల పాలనలో కాంగ్రెస్ పార్టీలు విఫలమయ్యాయని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌లు అన్నారు. గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అధ్యక్షతన ఖానాపూర్‌లోని శివాజీనగర్‌లో నిర్వహిం చిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డితో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అస్త్ర సన్యాసం చేశాయని ఎద్దేవా చేశారు. కనీసం అభ్యర్థిని నిలపకుండా బీఆర్ ఎస్ అస్త్ర సన్యాసం చేయగా, తాము ప్రకటించిన అభ్యర్థి గెలిచే పరిస్థితి లేదని కాంగ్రెస్ అంతర్మథనం చెందుతుందన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తన అసలు రంగును బయట పెట్టిందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా నిరుద్యోగ భృతిని 14 నెలలుగా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఒక్కో నిరుద్యోగి ఖాతాలో 14 నెలలకు సంబంధించిన రూ.56 వేల భృతిని జమ చేసిన తర్వాతనే ఓట్లు అడగాలని కాంగ్రెస్‌ను ఎక్కడికక్కడ నిలదీయాలని నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఒక్క చదువుకున్న మేధావి కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేసే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కచ్చితంగా బీజేపీ విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఖానాపూర్ మండలంలో 1278 మంది పట్ట భద్రులు, 114 మంది ఉపాధ్యాయులు ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ప్రతీఒక్కరిని క్షేత్రస్థాయిలోకి వెళ్లి కలవాల్సిన బాధ్యత బీజేపీ సైన్యానిదేనన్నారు. బీజేపీలో బూత్ అధ్యక్షుడికి ఉన్నంత ప్రాధాన్యత ఇతర ఏ పార్టీలో ఉండదన్నారు. పచ్చీస్ ప్రభారి పేరిట 25 మంది పట భద్రులు, ఉపాధ్యాయ ఓటర్లకు ఒక నాయకుడు బాధ్యత తీసుకొని క్షేత్ర స్థాయిలో ముమ్మర ప్రచారాన్ని నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆకుల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్, జిల్లా నాయకులు గడ్డం రవీందర్, గోపాల్ రెడ్డి, పొల్సాని అనిల్ రావు, రవీందర్ రెడ్డి, సత్యవతి, స్వామి, శ్రావణ్, మక్కల భీమన్న, పెద్ద రమేష్, గంగారెడ్డి, పోశెట్టి, శేఖర్, పద్మయ్య, భీమన్న, జీవన్, తదితరులున్నారు.


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ నగేష్


బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద బస్టాప్‌లో నిలిపిన వాహనాలు

బస్టాండ్‌లో వాహనాలు

● మండుటెండలో ప్రయాణికులు

బోథ్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్టాప్‌లో నిర్మల్, ఆదిలాబాద్ వెళ్లేవారు వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. ఫలితంగా ప్రయాణికులకు కూర్చునే స్థలం లేకపోవడంతో మండుటెండల్లో సహితం రోడ్లపై నిలబడాల్సి వస్తుందన్నారు.


బస్సు కోసం ఎండలో ఎదురు చూస్తున్న ప్రయాణికులు

మల్లాపూర్‌లో ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం


మల్లాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో హనుమత్ పంచాయతన ధ్వజ, యంత్ర, శిఖర, ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం నుంచి ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజులు అన్నదానం నిర్వహించనున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.


సాలెవాడకు చేరకున్న శివుని భారీ విగ్రహానికి కలశాలతో స్వాగతం పలికిన భక్తులు


శివుని భారీ విగ్రహం శోభాయాత్రలో భక్తులు

భక్తి పారవశ్యంలో మునిగిన సాలెవాడ(కె)

● శివాలయం చెంత శివుని భారీ విగ్రహం
● విగ్రహాన్ని ఘనంగా ఎదుర్కొన్న గ్రామస్థులు

ఉట్నూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని సాలెవాడ(కె) గ్రామం భక్తి పారవశ్యంలో మునిగింది. శివరాత్రి మహా పర్వదినం సమీపిస్తుండడంతో గత ఏడాది కాలంగా శివాలయం సమీపంలోని పర్వత ప్రాంతంపై సాలెవాడకు చెందిన వ్యాపారి అలావత్ నర్సోడు నాయక్ కుమారుడు అలావత్ సురేష్ సింగ్ రూ.లక్షలు కేటాయించి పర్వత ప్రాంతంపై 21.10 ఫీట్ల ఎత్తు గల శివుడి భారీ విగ్రహం ఏర్పాటుకు ఏర్పాట్లు చేయించారు. వరంగల్ జిల్లాలోని హుజు రాబాద్ ప్రాంతంలో ఏకశిలా రాయితో 21 ఫీట్ల ఎత్తుగల భారీ శివుని విగ్రహాన్ని తయారు చేయించి గురువారం భారీ వాహనంపై సాలెవాడ సమీపంలోకి తేవడంతో గ్రామస్థులు భక్తిశ్రద్ధలు భాజా భజంత్రీలతో మహిళలు కలశాలు తలపైన పెట్టుకొని శివుని విగ్రహానికి గ్రామ పొలిమేరలోకి ఎదురుగా వచ్చి పూజలు చేసి ఎదుర్కొన్నారు. శివాలయం సమీపంలోనికి తీసుకువచ్చి పూజలు చేసిన అనంతరం పర్వత ప్రాంతానికి క్రేన్ సహాయంతో తరలించారు. సాలెవాడకు చెందిన అందు సింగ్ రూ.రెండు లక్షలతో నవగ్రహాల విగ్రహాలను చేయించారు. రాజారామ్ రాబడే 70 వేలతో గణపతి విగ్రహాన్ని చేయించగా, కళావతి రామ్‌సింగ్ రూ.1.30 లక్షలతో ధ్వజ స్తంభం చేయించారు. శివరాత్రి మహా పర్వదినం రోజున భారీ విగ్రహానికి యజ్ఞం అనంతరం పూజలు అభిషేకాలు నిర్వహించేలా వారం రోజులపాటు సప్తాహ కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్షులు రవీందర్ తెలిపారు.


శివుని భారీ విగ్రహానికి ఎదురుకోవడానికి వచ్చిన భక్తులు

సీరాలలో చిరుత సంచారం

భైంసారూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీరాలలో గురువారం మహేష్ అనేరైతు చేనులో పంటకు నీళ్లు పారిస్తున్న సమయంలో చిరుత కనిపించింది. దీంతో మహేష్ కేకలు వేస్తూ ఇంటికి వెళ్లాడు. గ్రామప్రజలకు ఈ విషయాన్ని తెలిపాడు. గ్రామస్థులు పటాకులు వేస్తూ కట్టె లు పట్టుకొని రైతు చేనువద్దకు వెళ్లారు. అదే సమయంలో రైతుమోహన్ రావు పటేల్ చేను వద్ద కట్టేసిన కుక్కసైతం చనిపోయింది. గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. అధికారులు స్పందించి రక్షణ కల్పించాలని కోరారు.



ఈ సాక్ష యాప్‌తో.. సాక్ష్యాలు భద్రం!

- వినూత్నంగా ఈ సాక్ష యాప్
- సాక్ష్యాల రక్షణకు సాంకేతిక పరిజ్ఞానం
- అన్ని పోలీసు స్టేషన్‌ల అనుసంధానం
- కోర్టుల్లో పోలీసులకు తప్పనున్న తిప్పలు

నిర్మల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి వరకు సాక్ష్యాలను భద్రపరిచే సాంకేతిక నైపుణ్యం సరియైన రీతిలో లేని కారణంగా పోలీసు శాఖ తీవ్ర అవస్థలు ఎదుర్కొంటోంది. కష్టపడి కేసులను ఛేదించి నిందితులను జైలుకు పంపుతున్నా కేసుల చివరి దశల్లో సాక్ష్యాలు అందుబాటులో లేకపోతుండడం పోలీసులకు చిక్కులు ఏర్పడుతున్నాయి. నేర పరిశోధన కోసం చేస్తున్న పోలీసుల శ్రమ కూడా వృథాగా మారుతోంది. చివరకు తీర్పుల విషయంలో పోలీసులు ప్రతికూలతలు సైతం ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సాంకేతికతను వినియోగించుకొని ఈ కేసులకు సంబంధించిన సాక్ష్యాలను చిరకాలం భద్రపర్చుకునే విధంగా చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే అడ్వాన్స్ ఇన్వెస్టిగేషన్ కోసం ఈ సాక్ష యాప్‌ను అమలు చేయనుంది. నేరాలకు సంబంధించిన సాక్ష్యాలను జాగ్రత్తగా భద్రపర్చేందుకు ఈ యాప్ ఉపయోగడపడుతోంది. దీని కోసం ప్రతీ పోలీస్ స్టేషన్‌కు రెండు ప్రత్యేకంగా మొబైల్ ఫోన్‌లను ప్రభుత్వం అందిస్తోంది. ఈ మొబైల్ ఫోన్‌లలో ఈ సాక్ష యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి ఇక నుంచి ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే నేరాలకు సంబంధించిన ఫొటోగ్రఫీతో పాటు వీడియోగ్రఫీని రికార్డు చేయనున్నారు. ఇదే కాకుండా ఈ రికార్డులను ఈ యాప్‌లో భద్రపరుస్తున్నారు. ఈ యాప్‌లో భద్రపర్చబడిన సాక్ష్యాధారాలను కోర్టుల్లో ప్రవేశపెట్టి నేరస్తులకు తొందరగా శిక్ష పడే విధంగా చూడవచ్చని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల జిల్లాలోని ప్రతీ పోలీసు స్టేషన్‌కు రెండు మొబైల్ ఫోన్‌లను ఈ సాక్ష యాప్ కోసం అందించారు. ఇక నుంచి ఏదైనా పోలీసు స్టేషన్ పరిధిలో నేరం జరిగినట్లయితే మొత్తం ఆ నేరానికి సంబంధించిన రికార్డులను సాక్ష్యాలను ఈ యాప్ ద్వారా భద్రపర్చనున్నారు.


నిర్మల్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్న ఈ సాక్ష యాప్ సామగ్రి

పకడ్బందీగా సాక్ష్యాలకు రక్షణ

ఈ సాక్ష యాప్‌తో సాక్ష్యాలను భద్రపర్చడం ఇక పోలీసు శాఖకు సులభతరం కానుంది. సుదీర్ఘకాలం పాటు సాక్ష్యాలను భద్రపరిచే సౌకర్యం ఇప్పటి వరకు లేని కారణంగా పోలీసుశాఖ ప్రతికూలతలను ఎదుర్కొంటోంది. మొన్నటి వరకు కేవలం ఫొటోలు, రికార్డులు, వీడియోలు సాక్ష్యాల ఆధారంగా ఉండేవి. ఆ తరువాత కంప్యూటర్‌లలో ప్రత్యేక ఫోల్డర్లలో సాక్ష్యాలను భద్రపర్చే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అయితే వైరస్‌తో పాటు పలు సాంకేతిక కారణాలతో ఇవి కూడా డిలీట్ అవుతుండడం పోలీసు శాఖకు సమస్యగా మారింది. దీంతో ఆ శాఖ సాంకేతిక నిపుణులు ఈ సాక్ష అనే యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను కొద్ది రోజుల క్రితం ప్రయోగాత్మకంగా వినియోగించి సక్సెస్ అయ్యారు. దీంతో అన్ని పోలీసు స్టేషన్‌లలో ఈ యాప్‌ను ఇక అధికారికంగా ఉపయోగించి సాక్ష్యాలను భద్రపర్చనున్నారు. దీని కోసంగానూ ప్రతీ పోలీసు స్టేషన్‌కు రెండు సెల్‌ఫోన్‌లను ప్రభుత్వం కేటాయించింది.

పోలీసు స్టేషన్‌ల సమాచారం అనుసంధానం

కాగా అన్ని పోలీసు స్టేషన్‌లలో అందుబాటులో ఉన్న సాక్ష్యాలతో పాటు అన్ని రకాల సమాచారాన్ని అనుసంధానించబోతున్నారు. ఈ సాక్ష యాప్ అమలులో భాగంగా సమాచార వికేంద్రీకరణ ప్రక్రియను కూడా అమలు చేయాలని నిర్ణయించారు. అయితే ఈ సాక్ష యాప్ వినియోగంపై ప్రతీ పోలీసు స్టేషన్‌లోని సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరితో పాటు స్టేషన్‌లలో రైటర్‌లుగానూ, క్లరికల్ విధులు నిర్వహించే వారికి కూడా ఈ యాప్‌పై అవగాహన కల్పించారు. అలాగే కోర్టు డ్యూటీలు నిర్వహించే పోలీసు సిబ్బందికి కూడా ఈ యాప్‌పై పూర్తి పరిజ్ఞానాన్ని పెంపొందించారు. యాప్ ఓపెన్ చేయగానే కేసు నెంబర్‌లతో పాటు తేదీ, సంవత్సరాన్ని ఎంట్రీ చేస్తే ఆ రోజుకు సంబంధించిన కేసుల సాక్ష్యాలు కనిపించనున్నాయి. దీని కారణంగా కోర్టుల్లో సాక్ష్యాలను ప్రవేశపెట్టే సమయంలో ఈ యాప్ పోలీసు శాఖకు ఎంతో తోడ్పడనుందంటున్నారు. నిందితులకు శిక్ష పడే విధంగా ఈ యాప్ తన వంతు సహకారం అందించబోనున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి పోలీసు శాఖ ఇక నుంచి పకడ్బందీ ఎవిడెన్స్‌ను కోర్టుల్లో ప్రవేశపెట్టే విషయమై అన్ని రకాల ఇబ్బందులను అధిగమించబోతోందని చెబుతున్నారు. ఇప్పటికే అనేక రకాల సాంకేతిక నైపుణ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్న పోలీసు శాఖ ఈ సాక్ష యాప్‌తో మరింత ముందుడుగు వేయబోతోందని చెబుతున్నారు. గత కొంత కాలం నుంచి పెరిగిపోతున్న సైబర్ నేరాల విషయంలో కూడా నిందితులకు శిక్షలు పడే విధంగా ఈ యాప్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

రాయదారిలో షార్ట్‌సర్క్యూట్

- ఆరు ఇళ్లు దగ్ధం, భారీ ఆస్తినష్టం


రాయదారిలో దగ్ధమవుతున్న ఇళ్లు

పెంబి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని రాయదారిలో షార్ట్‌సర్క్యూట్‌తో గురువారం భారి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దాదాపు ఆరుగుడిసెలు దగ్ధమైనట్లు అగ్ని మాపక అధికారులు తెలిపారు. ఒక ఇంట్లో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం వల్ల దగ్ధమవ్వగా పక్కనే ఉన్న గుడిసెలకు నిప్పు అంటుకోవడంతో మొత్తం ఆరు గుడిసెలు దగ్ధమయ్యాయి. తక్షణమే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రూ.లక్షల్లో ఆస్తినష్టం జరిగినట్లు వెల్లడించారు. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు.

బాధితులను ఆదుకుంటాం..

- **కలెక్టర్ అభిలాష అభినవ్**

అగ్నిప్రమాద బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఆరు గుడిసెలు దగ్ధమయ్యాయి. బాధి తులకు భోజనం, రాత్రిబస ఏర్పాటు చేయా లని అధికారులను ఆదేశించాం. ఈ ఘట నకు సంబంధించి పూర్తి వివరాలను ప్రభు త్వానికి నివేదించాం. బాధితులు ఆందోళన చెందవద్దు, అండగా ఉంటాం.


బూడిదైన ఇళ్లు

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు


అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్టచర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయం, ఎన్టీఆర్ స్టేడియం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని టీచర్స్, గ్రాడ్యుయేషన్ పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు పటిష్టమైన భద్రతాచర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల మెటీరియల్, బ్యాలెట్‌బాక్స్‌లు, ఓటింగ్ మిషిన్లు, ఇతర అవసరమైన సామగ్రి సమయానికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు తగిన సూచనలు అందించాలని, వారికి పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలింగ్‌కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగులు ఓటుహక్కును వినియోగించుకునేం దుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్‌కు మార్, ఆర్డీవో రత్నకళ్యాని, జడ్పీ సీఈవో గోవింద్, తహసీల్దార్‌లు రాజు, సంతోష్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం లక్ష్మణచాంద మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన బాల శక్తివర్క్ షాప్‌కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలికలు, మహిళల సాధికారిత కోసం బాలశక్తి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, ఎగ్జామినేషన్ అధికారి పద్మ, డిస్ట్రిక్ట్‌సైన్స్ ఆఫీసర్ వినోద్‌కుమార్, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎంఈవో అశోక్‌వర్మ, ప్రత్యేకఅధికారి నవిత, ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత, మహిళా సాధికారతపై వారోత్సవాలు : కలెక్టర్

నిర్మల్ కల్చరల్ : ఆర్థిక అక్షరాస్యత, మహిళా సాధికారతపై ఈ నెల 24 నుంచి 28 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు నిర్వహించే వారోత్సవాల్లో కళాశాల విద్యార్థులు, మహిళా సంఘాలు పాల్గొంటారని పేర్కొన్నారు. 25న జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహిస్తామని తెలిపారు. వారోత్సవాల్లో ఆర్థిక ప్రణాళిక, పొదుపు, నష్ట నివారణ చర్యలు, రుణాలు పొందడం తదితర వాటిపై అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ సమన్వయంతో వారోత్సవాలు నిర్వహిస్తామని వివరించారు. మహిళా సంఘాలు, ట్రాన్స్ జెండర్లు, దివ్యాంగులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తారని తెలిపారు.

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



బాలశక్తి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌రూరల్ : జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు సయ్యద్ అర్జుమన్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వచ్చే నెలలో మొదలు కానున్న రంజాన్ పర్వదినం సందర్భంగా జిల్లాలో ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ యూనిట్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలి : కలెక్టర్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ డీలర్లను ఆదేశించారు. గురు వారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా పంపిణీపై పౌర సరఫరాల శాఖ అధికారులు, డీలర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పారదర్శకంగా ప్రజాపంపిణీ ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు రేషన్‌బియ్యం, నాణ్యమైన సరుకులు అందించాలని, రేషన్‌షాప్ డీలర్లు సరుకులను సక్రమంగా లబ్ధిదారులకు అందించడంలో పారదర్శకత పాటించాలన్నారు. జిల్లా నుంచి ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు రేషన్‌బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని గుర్తించడం జరిగిందని, బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నెలా ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన సమయంలోగా పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదే శించారు. రేషన్‌షాప్‌లలో సరుకు నిల్వ, వివరాలకు సంబంధించిన రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఎం గోపాల్, అధికారులు, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయండి

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బీన్ హమ్దాన్


భైంసా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్

భైంసా, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి గెలుపు కోసం గాను కాంగ్రెస్ శ్రేణులు ప్రతిష్టాత్మంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మెన్ తాహేర్ బిన్ హమ్దాన్ పిలుపునిచ్చారు. గురువారం భైంసాలో పార్టీ ఇంచార్జీ బోస్లే నారాయణరావ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కార్యాలయాల్లో కాంగ్రెస్ శ్రేణులతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో పార్టీ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలో కార్యోన్ముఖులు కావాలని సూచించారు. గ్రామాల వారీగా ఓటరు జాబితాకు అనుగుణంగా పట్టభద్రులను కలిసి వారి మద్దతు, ఓట్లు దక్కించుకునే దిశగా అడుగులు వేయాలన్నారు. పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో వ్యవహరిస్తూ ,సమిష్టిగా కృషి చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం బాధ్యతాయుతంగా పాటుపడాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆదేశించినట్లుగా పేర్కొన్నారు. ఎన్నిక కంటే రెండు, మూడు రోజుల ముందు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని నిర్మల్, మంచిర్యాల్ కేంద్రాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టభద్రుల ఎన్నికల బహిరంగ సభలు నిర్వహించనున్నారని వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావ్ మాట్లాడుతూ గ్రూప్ విబేధాలకు ఆస్కారం లేకుండా కాంగ్రెస్ శ్రేణులు ఐక్యతతో పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ముందుకు సాగాలన్నారు.

'తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి'

కుంటాల, ఫిబ్రవరి, 20 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో లింబాద్రి అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాలలో మిషన్ భగీరథ పంపౌజ్‌ను పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సాంకేతిక లోపాలు తలెత్తితే ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతూ తాగునీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దత్తురాం, పంచాయతీ సెక్రటరీ రాజాబాబుతో పాటు పలువురు ఉన్నారు.

లబ్ధిదారులకు అవగాహన


ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముథోల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గురువారం ఎంపీడీవో శివకుమార్, హౌసింగ్ డీఈఈ దయానంద్‌లు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. వెంకటాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విధివిధానాల గురించి వారికి తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని త్వరలో పూర్తివివరాలు తెలియజేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు బేస్మెంట్‌లెవల్, డోర్‌లెవన్, స్లాప్, ప్లాస్టింగ్ చేసిన తర్వాత నాలుగు విడతలుగా డబ్బులు విడుదల చేస్తామని సూచించారు. వెంకటాపూర్‌లో 62 మంది ఇందిరమ్మ లబ్ధిదారులున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రమ్యశ్రీ పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలతో కదిలిన యంత్రం


మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 686లో కొలతలు చేపడుతున్న సిబ్బంది

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ముష్కం సత్యమ్మ 686 సర్వేనెంబర్‌లో ఏడు గుంటల భూమి తనదంటూ గతంలో హైకోర్టులో పిటిషన్ వేశారు. గురువారం జిల్లా పంచాయతీ అధికారి పోతకోటి శ్రీనివాస్, తహసీల్దార్ సోమశ్రీనివాస్ ఆధ్వర్యంలో 686 సర్వే నెంబర్ భూమి కొలతలు చేపట్టి హద్దులను నిర్ణయించారు. ఈ సందర్భంగా డీపీవో శ్రీనివాస్ మాట్లాడుతూ... జాయింట్ సర్వే చేయడం వల్ల అనుమతులు లేకుండా బంగ్లా ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణాలు బయటపడ్డాయని తెలిపారు. వాటి వివరాలు కూడా సమగ్ర సర్వే చేపట్టి ప్రభుత్వ భూములను కాపాడుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి పోతకోటి శ్రీనివాస్, తహసీల్దార్ సోమ శ్రీనివాస్, గిర్దావర్ వేణుగోపాల్, ఎంపీవోలు శ్రీనివాస్ గౌడ్, తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వీణ, కైలాస్, సర్వేయర్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో లాభాలు

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) :సమీకృత వ్యవసాయంతో లాభాలు ఉంటాయని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో గల సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల కొండాపూర్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యవసాయ క్షేత్రంలో పెంచుతున్న చేపలు, కూరగాయలు, కంపోస్ట్ తయారీ గురించి వివరించారు. దీనివలన తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభిస్తుందని తెలిపారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.